

# పెళ్ళిచూపులు

ఆరోజు ఇల్లంతా గంద్రగోళంగా ఉంది. కారణం ఏమిటో తెలియక నేను తికమక పడుతున్నాను. అందరు హడావిడిగా ఉన్నారు. ఎవరిని అడిగినా విసుక్కుంటున్నారు కాని, సరియైన సమాధానం ఇవ్వలేదు. మెల్లిగా పూజ గదిలో ఉన్న బామ్మ దగ్గిరికి చేరి, ''బామ్మా!'' అని మెల్లిగా పిలిచాను. ''ఏమిటే అమ్మడూ? అరిటిపండు కావాలా?''అంది బామ్మ. ''ఊహుఁ'' అని తలతిప్పుతూ ''ఇవాళ మనింట్లో ఎందుకు హడావిడిగా ఉన్నారు?'' అని అడిగాను. బామ్మ ఒక్కసారి తన నోరు విశాలం చేసుకొని, ''నీకు తెలీదుటే! అక్కయ్యకి పెళ్లివారు వస్తున్నారు'' అంది. 'అదా సంగతి!' అనుకుంటూ అక్కయ్య దగ్గిరికి దారి తీశాను. అది పందిరి మంచం మీదపవ్వళించి తదేకదృష్టితో ప్రభ చదువుకుంటూంది.

దాని పక్కగా చేరి, ''అక్కయ్యా! ఇవ్వాళ మనింటికి ఎవరు వస్తారే?'' అన్నాను నవ్వుతూ. అది విసుగ్గా మొహంపెట్టి ''ఏమో నాకేం తెలుసు?'' అంది.

''నీకు తెలియదా? నేను చెప్పనా? పెళ్లివారు'' అన్నాను. ''ఓహో'' అంటూ అటు పక్కకు తిరిగి పడుకుంది. ''అబ్బ! ఎంత స్టయిలే!'' అన్నాను నేను కొంటెగా. ''ఏయ్! నువ్విక్కణ్ణించి పోతావా? తన్ననా? కథ చదువుతూంటే వెధవ ప్రశ్నలూ, నువ్వూను'' అన్నది మా రమణి అక్కయ్య. నేను అక్కడుంటే ప్రమాద

మని ఆ రంగంనుంచి తప్పుకున్నా. మరిచిపోయా. మా కుటుంబాన్ని మీకు పరిచయం చెయ్యలేదు కదూ? నాకొక అమ్మ, నాన్న, బామ్మ కలరు. వ ుగ్గరా

ముసలివాళ్లలో లెక్క. కాబట్టి వదిలివెయ్యండి. ఇక నాకు ఒక అక్కయ్య, ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారు. అన్నయ్య ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తు

న్నాడు. అక్కయ్య బి. ఎ. చదువుతూంది. నేను ఫోర్తు ఫారం చదువుతున్నాను. తమ్ముడు నాలుగవ క్లాసు. పెళ్లికూతురు, అంటే అక్కయ్యపేరు రమణి. దానికి వీలయినంత తొందరగా పెళ్లి చెయ్యాలని ముసలాళ్ల ప్రయత్నం. అక్కయ్యను సుమారుగా ఒక అరడజను మంది పెళ్లికొడుకులు చూశారు. కొందరికి అది నచ్చలేదు. కొందరు మాకు నచ్చలేదు. మరికొందరికి మా కట్నం నచ్చలేదు. ఇంతకీ దానికి కల్యాణ ఘడియ రాలేదంటుంది బామ్మ. ఇవాళ వచ్చే పెళ్లికొడుకు ఎలా ఉంటాడో అని ఆలోచిస్తూ హాలులోకి వెళ్లాను.

## 2

మధ్యాహ్నం మూడు గంటలు అయింది. నాన్నగారు హాలులో కుర్చీలు సర్దిస్తున్నారు. అమ్మ వంటింట్లో పకోడీలు వగైరా చేస్తూంది. అన్నయ్య బజారుకు వెళ్లి కావలిసిన పదార్థాలు అమ్మకి అందిస్తున్నాడు. అక్కయ్యమటుకు హాయిగా నిద్రపోయింది. నాకేం చెయ్యాలో తోచక అమ్మ దగ్గిరికి వెళ్లాను. ఆవిడ పకోడీలు చేస్తూ, "వెంకటరమణా! నేత్రి తికిఉండగా దీని పెళ్లి అవుతుందా? ఈ సంబంధమైతే నీకొండకి తీసుకు వస్తాను. ఏం చేస్తావో, నీ దయ" అంటూ వాపోతూంది. నేను అదే సమయమనుకుని "అమ్మా! బావగారు ఏం చేస్తున్నారు?" అన్నాను. "బావగారే, బావగారు! దానికి పెళ్లయ్యేవరకూ నీకు అందరూ బావగార్లే" అంది చేతులు తుడుచుకుంటూ అసలు విషయం చెప్పకుండా. ఇంకా ఎక్కువ అడిగితే అష్టోత్తరం మొదలుపెడుతుందని అక్కణ్ణించి నిష్క్రమించాను. అమ్మ వంట ఇంటి పని ముగించుకొని హాలు తనిఖీచేసి అక్కయ్య గదిలోకి ప్రవేశించింది. అది హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతూంది. ఆ వాలకం చూశాక అమ్మకు ఒళ్లుమండి, "ఒసేయ్ రమణీ! లేవవే తల్లీ! వాళ్లు వచ్చే వేళయింది. నిన్ను సరిదీయలేక అంకెళ్లు పడిపోతున్నాయి. ఇంక నిద్ర చాలులే. ఎప్పుడూ వెధవ నిద్రా నువ్వూనూ.దరిద్రం కూడాను" అంటూ దండకం మొదలుపెట్టింది. అక్కయ్య వినుక్కుంటూ లేచి "అబ్బ! ఇప్పుడే నిద్ర పట్టిందే బాబు" అంది బాత్‌రూంకేసి బద్ధకంగా అడుగులేస్తూ. అమ్మ గిర్రున తిరిగి అక్కడే ఉన్న నామీద తన కోపం వెళ్లగక్కుతూ "ఏం? నీకు మళ్లా మనవి చేసుకోవాలా? తల దువ్వుకొని, బట్టలేసుకొని తగలడు" అంటూ రుసరుస లాడింది. అక్కడ ఉంటే ఇంక ప్రమాదమనుకొని అక్కయ్య దగ్గిరికి పరిగెత్తాను నేను. "ఒసేయ్! టేబిలు క్లాతెక్కడ?" నాన్నగారు హాలులోంచి పొలి కేక పెట్టారు. అమ్మ విసుక్కుంటూ టేబిల్‌క్లాత్ తీసి ఇచ్చింది. ఇంతలో మా తమ్ముడు "అమ్మా! అమ్మా! నాకు మొన్న కుట్టించిన కొత్తలాగు కావాలే!" అన్నాడు. అమ్మ వాణ్ణి నాలుగు మొట్టి లాగు పడేసి మా దగ్గిరికి వచ్చింది. నేను, అక్కయ్య తీరుబడిగా మొహానికి సబ్బు పట్టించి కబుర్లు చెప్పుకుంటున్నాము. అమ్మ రావడంతో మొహం తొలుచుకొని బయటపడ్డాము. "నువ్వు ఆ నీలం చీర కట్టుకోవే, రమణీ!" అని నాకేసి తిరిగి, "నువ్వు ఆ ఆకుపచ్చ పరికిణీ, జాకెట్టు వేసుకో" అని ఆర్డర్ ఇచ్చింది. ఇంతలో నాన్నగారు తొందరగా హాలులో

**ప్రపంచంలో చాలామంది అలవాటుగా చాలా పనులు చేస్తూ ఉంటారు. ఎందుకు? అన్న ఆలోచన రాదు ఎన్నడూ. అలాంటి వాటిలో ఈ 'పెళ్ళి చూపులు' అన్న తతంగం ఒకటి. ఇది ఉభయపక్షాలవారికి కూడా గౌరవ భాజనం కాదు అన్న భావనకు ఇప్పుడిప్పుడే బలం చేకూరుతూంది. అయినా తతంగం మాత్రం తప్పడం లేదు, మరి.**

నించి వచ్చి, "అమ్మా, రమణీ! అయిందా? తొందరగా తెములు" అని అమ్మకేసి తిరిగి, "నువ్వు కూడా చీర మార్చుకో" అంటూ వచ్చినంత హడావిడిగాను హాలులోకి పరుగు తీశారు.

అక్కయ్య, నేను ముస్తాబయిన గంటకు పెళ్లివారు విచ్చేశారు. అన్నయ్య, నాన్నగారు తెచ్చిన ఫలహారాలన్నీ పెళ్లివారిని బ్రతిమాలుతూ మింగబెడుతున్నారు. ఆరగించడం వగైరా అయిన తరవాత, అక్కయ్యను నాన్నగారు పిలిచారు. అక్కయ్య ఒయ్యారంగా హాలులోకి వెళ్లి చాపమీద కూలబడింది. దాని పక్కనే నేను కూర్చున్నాను. పెళ్లివారు నలుగురు. పెళ్లికొడుకు, పె. కొ. తండ్రి, పె. కొ. తల్లి, పె. కొ. అక్కయ్య వచ్చారు. పె.కొ. అక్కయ్య, తల్లి మా అక్కను నఖశిఖ పర్యంతం పరీక్షిస్తున్నారు. వాళ్లను చూసేటప్పటికి నాకు చిరుచెమటలు పోశాయి. కథల్లో రాక్షసుల్లా ఉన్నారు. పెళ్లికొమారుడుగారు ఎలా ఉంటారో అని చూశాను. నిజంగా నా మతి పోయింది. ఆ మహానుభావుడు ఏడు అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు. నల్లని శరీరచ్ఛాయ. ఆతాంటిదే టెరిలీన్ పాంటు, తెల్లని టెరలీన్ షర్టు వేసుకుని దర్జాగా కుర్చీలో కూర్చుని అక్కయ్యను పరీక్షిస్తున్నారు. ఆ శాల్తీ పక్కనే అదే ఆకారంలో కొంచెం ముసలిశాల్తీ కూర్చుంది. పెళ్లికొడుకు అక్కయ్య ఏదో ప్రశ్నించడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. ఆవిడ ఏమడిగిందో తెలియలేదుకాని ఆ కంఠస్వరంమటుకు చక్కగా వినిపించింది.

పె. కొ. త.: నీ పేరేమిటి? (అక్కయ్యను, నన్ను కాదు.)

అక్కయ్య: రమణి.

పె.కొ.అ.: (గడుసుగా) ఏం చదువుతున్నావు? (గార్దభస్వరం)

అ: బి. ఎ.

పె. కొ. తం.: ఏ గ్రూపు? (మేక గొంతుకు) (తండ్రీ కూతుళ్లకంటే ఆవిడ కంఠ స్వరం బాగుంది.)

అ: హెచ్. ఇ. పి.

వాళ్లు ముగ్గురూ ఇంటర్వ్యూకు వచ్చిన కాండిడేట్స్‌ను ప్రశ్నించినట్లు వాళ్ల తెలివితేటలన్నీ ప్రశ్నల రూపంలో అక్కయ్యమీద ప్రదర్శిస్తున్నారు.

పె. కొ. తం: (కొడుకు వైపు తిరిగి): సుందూ, నువ్వేమైనా అడుగుతావా?

పె. కొ. : తలఊపి కుర్చీలో సర్దుకు కూర్చుని, గొంతుకు సవరించుకొని అక్కయ్యమీద ప్రశ్నలవర్షం కురిపించసాగాడు.

పె. కొ.: (గంభీరంగా) నీ పేరేమిటి? (నువ్వంటా

**పి. లక్ష్మి**

డేమిటి? అనుకున్నాను.)

అ: రమణి.

పె. కొ.: సంగీతం వచ్చా?

అ: వచ్చు.

పె. కొ.: నాట్యం వచ్చా ?

అ: వచ్చు.

పె. కొ. అ.:(తీవ్రంగా) నాట్యం వస్తే ఏం లాభం? సంగీతమయితే ఎప్పుడైనా పాడుకోవచ్చుగాని, డాన్సు అయితే ఏం లాభం? తైతక్కలాడ్డం తప్పితే.

పె. కొ. త.: ఒక పాట పాడు తల్లీ!

అ: తొలి నే చేసిన పూజాఫలము. . . ఆ. . .

పె.కొ.:ఫరవాలేదు. కొంచెం సాధన చెయ్యవలసి ఉంది.

అ: (కోపంగా) చిత్తం. (నేను ఫక్కున నవ్వాను. అమ్మ గుడ్లు ఉరిమింది. అన్నయ్య నామీద నిప్పులు కురిపించాడు.)

పె. కొ.: వంట వచ్చా?

అ: వచ్చు.

పె. కొ.: కొంచెం నడు.

అక్కయ్య అయోమయంగా అమ్మకేసి చూసింది. అమ్మ ప్రశ్నార్థకంగా పె. కొ. తల్లికేసి చూసింది. ఆవిడ అదేదో సామాన్య విషయంలా ముఖంపెట్టి "ఆ! ఏమీలేదు. వాడికి ఎవరో కాలు వంకర పిల్ల వస్తుందని జాతకం చెప్పారు" అంది. (జాతకం కూడానా! చచ్చాం! అనుకున్నాను.)

అక్కయ్య ఒకసారి హాలంతా ఒయ్యారంగా నడిచి వచ్చింది.

పె. కొ.: కుట్టు వచ్చా. ?

అ: వచ్చు. కుట్టి చూపించనా? (మళ్లా నేను ఇకిలించా. అమ్మ, అన్నయ్య డిటో.)

పె. కొ.: ఉద్యోగం చెయ్యడం ఇష్టమేనా?

అ: లేదు.

పె. కొ.: లేదూ! పోనీ, చేతిపనులు ఏమైనా వచ్చా?

అ: రావు.

పె. కొ.: రాదా! సరే, దేవుడంటే భక్తి ఉందా? అదీ లేదా?

అ: (కోపంగా) లేదు. (పె. కొ. కొంచెంసేపు ఏదో ఆలోచించాడు.)

పె. కొ: (తండ్రివైపు తిరిగి) కట్నం సంగతి మాట్లాడు.

పె. కొ.: కట్నం ఎంతిస్తారు ?

పె. కొ. త.: మావాడికి ఇరవై అయిదువేలిస్తామని వస్తున్నారు.

పె. కొ. అ.: కనీసం పదివేలయినా ఫరవాలేదు. ఆడబడుచు లాంఛనాలు వగైరా ఉన్నాయనుకోండి.

నాన్నగారు : పిల్లకి, పిల్లవాడికి నచ్చితే అవన్నీ మాట్లాడుకోవచ్చు.

పె. కొ.: నాకు పిల్ల నచ్చింది.

అన్నయ్య: పిల్లకు మీరు నచ్చలేదా?

పె. కొ. త.: (కొంచెం ఆశ్చర్యంగా) ఆడపిల్లలకి నచ్చడం ఏమిటి?

పె. కొ.: (అక్కయ్య వైపు తిరిగి): నువ్వేమైనా అడగాలా?

అక్కయ్య ఔనని తల ఊపింది. అక్కరలేదంటుంది అనుకున్నాడు కాబోలు. నిర్ఘాంతపోయి, వెంటనే తేరుకున్నాడు.

అ: మీ పేరు?

పె. కొ.: సుందరరావు. (నాకు నవ్వు)

అ: వంట చెయ్యడం వచ్చా?

పె. కొ.: (కోపంగా) నాకు రాదు. వంట చెయ్యడం అవసరం లేదు నాకు.

అ: (నవ్వుతూ) ఎప్పుడైనా అవసరం వస్తే ఏం చేస్తారు?

పె. కొ. త.: (మూతి, చేతులు తిప్పుకుంటూ): అమ్మో! చదువుకున్న పిల్లలు మన మాట వినరని వేరే చెప్పలేదూ!

అ: (వినిపించుకోనట్లుగా) మీరేం పాస్ అయ్యారు?

పె. కొ.: (గర్వంగా): ఐ. పి. ఎస్.

అ: అంటే అర్థం?

పె. కొ.: ఇండియన్ పోలీసు సర్వీసు.

అ: పోలీసుల పని ఏమిటి?

పె. కొ.: నేరస్థుల్ని పట్టుకోవడం. (కోపం)

అ: ఎటువంటి నేరస్థుల్ని? బ్లాక్ మెయిల్ చేసే వాళ్ళని కూడానా?

పె. కొ.: (కోపంగా) నవ్వులాటలాఉంది నీకు. ఇలా ఎదురు జవాబులు చెప్పితే నాకు మంట. చదువుకున్నా నీకు మర్యాద తెలీదు. (ఈయనికి తెలిసినట్టు!)

అ: (నవ్వుగా) జవాబు చెప్పలేదు!

పె. కొ.: అందర్నీ, అన్నిరకాల నేరస్థుల్ని పట్టుకుంటాము.

అ: కట్నాలు పుచ్చుకోవడం నేరం కాదూ?

(అన్నయ్య పెదవులమీద నవ్వు. అమ్మ కళ్లనించి నిప్పులు.)

పె. కొ.: అ నేరమే! (ఆ ప్రశ్నలో అంతరార్థం బోధ పడింది కాబోలు. లేచి నిలుచుని తల్లివైపు తిరిగి): అమ్మా! పోదాం రా! పిల్లకు బొత్తిగా మర్యాదలేదు.

అ: (కోపంగా లేచి నిలుచుని): మాకుకాదు మర్యాద లేకపోవడం. మీకే. డి. వై. ఎస్. పి. అయ్యుండి మీరే కట్నం పుచ్చుకొని రూల్సుకి వ్యతిరేకంగా ఉంటే— ఇంక నేరస్థుల్ని ఏం పట్టుకుంటారు?

పె. కొ.: షటప్!

అన్నయ్య: (కోపంగా లేచి) గెట్ అవుట్.

పెళ్లివారు వీధిలోకి దారి తీశారు. పోతూ, పోతూ పె. కొ. త. అక్కసుగా, "ఈ పిల్ల నాకు అసలు నచ్చలేదురా, నుంది!" అంది, పోయేది పోక. వాళ్ళు పోయాక అక్కయ్య హాయిగా గాలి పీల్చుకొని అక్కణ్ణించి వెళ్లిపోయింది.

అన్నయ్య "తను తుక్కు ప్రశ్నలన్నీ వేసి, పైగా దానికి మర్యాద లేదనడం! వాడు నువ్వు, నువ్వంటూంటే తన్నాలనిపించింది నాకు" అంటూ వీధిలోకి నిష్క్రమించాడు. అమ్మ వంటింట్లోకి, నాన్న పూజ గదిలోకి వెళ్లిపోయారు. ★



# ఆలన, ఆదరణ లేని విశాఖ బీచ్ రోడ్

**విశాఖపట్టణానికి** ఎంత ప్రాముఖ్యంఉన్నదో, విశాఖ లోని బీచ్ రోడ్డుకు అంతటి ప్రాధాన్యం ఉన్నది. డాల్ఫిన్స్‌నోస్‌నుండి నౌకా కేంద్రంవరకూ ఉన్న ఈ రహదారి దాదాపు రెండు సంవత్సరాలుగా సముద్రపు అలలకు గురిఅయి కోసుకుపోతున్నా గమనించిన వారు, ఆలించి పాలించినవారు లేరు. ఈనాడు ఇది బాగు చెయ్యడానికి కూడా వీలులేని అధ్వాన్న స్థితిలో ఉన్నది.

టౌన్‌హాల్ రోడ్ జంక్షన్‌నుండి కంచరవీధి జంక్షన్ వరకు ఉన్న రోడ్డు దిగువ భాగం సముద్ర తరంగాల కోతకు గురిఅయి సముద్రంవేపు ఒరిగిపోతున్నట్లుగా ఉన్నది. అది ఎప్పుడైనా కూలిపోగలదు. ఆ దుర్ఘటన జరిగినప్పుడు ఎందరు ప్రాణాలు కోల్పోతారో, ఎన్ని కార్లు ఒరిగిపోతాయో చెప్పలేం. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలవల్ల, సముద్ర తరంగాల ఉధృతపు కోతవల్ల ఈ రోడ్డు పాడైపోయింది. వెంటనే అధికారులు తగు చర్య తీసుకొని రోడ్డు మరమ్మత్తులు చెయ్యకపోతే రోడ్డుకు ఆపక్క ఉన్న భవనాల గతి ఏమౌతుందో అర్థంకాదు. ఎంత నష్టం వాటిల్లగలదో ఊహించలేం.

దీని ప్రమాదం గుర్తించి, పోలీసు అధికారులు, పురపాలకులతో సంప్రదించి జూన్ 4 న ఈ రహదారిపై రాక పోకలను నిషేధించారు. నగర పథకం కార్యాలయం వీధిలోనుండి రాకపోకలు సాగిస్తున్నారు.

పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ టి. ఎస్. ఎన్. రాజు దృష్టికి ఈ విషయం తీసుకురాగా, వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం ప్రారంభించారు. వారే బాధ్యులైనట్లు, ప్రముఖులు రాష్ట్ర కేంద్ర మంత్రులు ఎవరు విశాఖపట్టణం వచ్చినా, ఈ బీచ్‌రోడ్ దుస్థితిని గురించి వివరిస్తూ, వారికి దానిని చూపిస్తున్నామని, సముద్రపు కోతను అరికట్టడానికి తగు చర్య తీసుకోవాలనే వారికి విన్నవిస్తున్నామని శ్రీ రాజు అన్నారు. అయితే ఇంతవరకు దాని విషయం ఎవరూ పట్టించుకలేదు.

తొలిగడనే, తగిన చర్య తీసుకుని ఉంటే కొద్ది వేల రూపాయల ఖర్చుతో దీని మరామ్మత్తులు పూర్తి అయి ఉండేవని, ఆలస్యం కావడంవల్ల ఇప్పుడు దానికయ్యే ఖర్చు లక్ష రూపాయలవరకూ ఉంటుందని పురపాలక సంఘాధ్యక్షుని అంచనా.

— పి. ఎస్. ఎస్. పతి

